మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- మైలవరం ఏసీపీ మురళీమోహన్
- ఘనంగా మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం
- పలు ప్రాంతాల్లో ర్యాలీలు, మానవహారాలు



నూజివీడు ట్రిపుల్ ఐటీలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, పోలీస్, సెబ్ అధికారులు

మైలవరం: మత్తు పదార్థాలతో జీవితాలు అంధకారమవుతాయని, విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని మైలవరం ఏసీపీ మురళీమోహన్ అన్నారు. మైలవరం వీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ మత్తు పదార్థాలకు బానిసలు అయితే జరిగే పరిణామాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం స్థానిక బస్‌స్టాండ్ సెంటర్‌లో విద్యార్థులతో మానవహారం, ర్యాలీ నిర్వహించారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రమాణం చేయించారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల ఆరోగ్యం పూర్తిగా దెబ్బ తినడమే కాకుండా సమాజంలో నైతిక విలువలు కోల్పోతారని చెప్పారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సరళ, వైస్ ప్రిన్సిపాల్ రంగారావు, మైలవరం ఏరియా ఎస్ఈబీ ఏఎస్ఓ భార్గవ్, కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ వి. ఫణికుమార్, ఎస్ఈబీ సిబ్బంది, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

- **రెడ్డిగూడెం:** మత్తుపదార్థాలు సేవించడం వల్ల భవిష్యత్ అంధకారం అవుతుందని రెడ్డిగూడెం ఎస్ఐ గోవింద్ అన్నారు. మత్తు పదార్థాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా రెడ్డిగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం జరిగింది. నవజీవన్ బాలభవన్-ఫ్రెండ్స్ సర్వీసు సొసైటీ స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ధర్మశీల, నవజీవన్ బాలభవన్ ఏరియా కో-ఆర్డినేటర్ శ్రీనివాస్, ఫ్రెండ్స్ సర్వీసు సొసైటీ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల జోలికి పోవద్దు



మాట్లాడుతున్న డీఎస్పీ లక్ష్మయ్య

నూజివీడు: మాదక ద్రవ్యాలను, మత్తు పదార్థాలను సేవించడం వల్ల జీవితాలు నాశనం అవుతాయని, గౌరవప్రదమైన జీవితం ఉండదని నూజివీడు డీఎస్పీ జి. లక్ష్మయ్య అన్నారు. మాదక ద్రవ్యాల వాడకం వల్ల కలిగే నష్టాలపై బుధవారం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్, పోలీస్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలోని నూజివీడు ట్రిపుల్ ఐటీలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ట్రిపుల్ ఐటీ ఆవరణలో విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. డీఎస్పీ లక్ష్మయ్య మాట్లాడుతూ డ్రగ్ రహిత దేశంగా భారత దేశాన్ని మార్చడంలో ప్రతి ఒక్కరి బాధ్యత ఎంతో ఉందన్నారు. ప్రపంచ మానవాళి పురోభివృద్ధికి గంజాయి అడ్డంకిగా మారిందన్నారు. విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి చదువుపై దృష్టి సారించి చక్కగా చదువుకోవడం ద్వారా జీవితంలో ఉన్నత స్థానానికి ఎదగాలని చెప్పారు. నూజివీడు రూరల్ సీఐ రామకృష్ణ, టౌన్ ఎస్ఐ ఎంవీవీఎస్ఎన్ మూర్తి, సెబ్ ఇన్‌స్పెక్టర్ వెంకట రమణ మాట్లాడారు. ట్రిపుల్ ఐటీ సిబ్బంది, ఎన్‌సీసీ క్యాడెట్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో అనర్థాలపై అవగాహన

తిరువూరు: యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని తిరువూరు సీఐ అబ్దుల్ నబీ అన్నారు. మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా తిరువూరులో బుధవారం పోలీస్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోల ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలతో జరిగే అనర్థాలపై అవగాహన ప్రదర్శన నిర్వహించారు. పోలీసు స్టేషను నుంచి బైపాస్ రోడ్డు వరకు జరిగిన ప్రదర్శనలో సీఐ మాట్లాడుతూ గంజాయి, హెరాయిన్ తదితర మత్తు పదార్థాలు సేవించే వారిని సమాజం గౌరవించదన్నారు. తిరువూరు ఎస్ఐ సత్యనారాయణ, సిబ్బంది ప్రదర్శనలో పాల్గొన్నారు. తిరువూరు శాఖా గ్రంథాలయంలో మాదక ద్రవ్యాలను నిరోధిస్తామని పాఠకులతో గ్రంథాలయాధికారి పద్మావతి ప్రతిజ్ఞ చేయించారు.

- **జి.కొండూరు:** యువత అసాంఘిక శక్తులుగా మారటానికి కారణమవుతున్న మాదక ద్రవ్యాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని గంగినేని జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం జీవీ రామకృష్ణ అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యాలు, వాటికి అడిక్ట్ కావడం వల్లన కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమాన్ని హెచ్ఎం బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


ఇబ్రహీంపట్నం ర్యాలీలో పాల్గొన్న సీఐ సత్యనారాయణ, ఎస్ఐ అనూష తదితరులు

- **ఇబ్రహీంపట్నం:** నేటి యువతరం మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని స్టేషన్ సీఐ ఎం.సత్యనారాయణ అన్నారు. మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఇబ్రహీంపట్నంలో బుధవారం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. మత్తు పదార్థాల వినియోగం వలన కలిగే దుష్ఫలితాలు, గంజాయి, తదితర మత్తు పదార్థాల అక్రమ రవాణాను అరికట్టడంపై ప్రజలకు అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాల వినియోగంతో శరీరంలో అన్ని అవయవాలు అస్తవ్యస్తం అవుతాయన్నారు. మత్తు పదార్థాల రవాణా, నిల్వలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్ఐ అనూష, ఎంఈఓ పుష్పలత, వివిధ పాఠశాలల విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.
- **లక్ష్మీపురం(తిరువూరురూరల్):** మండలంలోని లక్ష్మీపురం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో బుధవారం మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. సహకార శాఖ ఆదేశాల మేరకు మాదక ద్రవ్యాలను ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా నిరోధించాలని సంఘ సీఈఓ బొల్లినేని రఘురాం కోరారు. ఈ సందర్భంగా మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడతామని సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు.


మైలవరంలో విద్యార్థులు, పోలీసుల ర్యాలీ


తిరువూరులో ప్రదర్శన నిర్వహించిన పోలీసులు


తిరువూరు గ్రంథాలయంలో పాఠకుల ప్రతిజ్ఞ


గంగినేని జెడ్పీ హైస్కూల్లో అవగాహన కల్పిస్తున్న హెచ్ఎం రామకృష్ణ

డంపింగ్ యార్డ్ తరలింపునకు చర్యలు



ఆగిరిపల్లి: ఆగిరిపల్లిలోని గంగానమ్మ గుంట వద్ద ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డ్‌తో ప్రభుత్వ కళాశాల వద్ద నివాసం ఉంటున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దీనిపై ఈనెల 24న 'పొగ చూరుతున్న బతుకులు' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. తహసీల్దార్ మృత్యుంజయరావు తక్షణమే డంపింగ్ యార్డ్‌లోని పొగ నివాసాలలోకి రాకుండా చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శి ప్రసాద్‌ను ఆదేశించారు. అలాగే డంపింగ్ యార్డ్‌ను గంగానమ్మ గుంట నుంచి వేరే ప్రదేశానికి తరలించేందుకు గ్రామంలో ప్రభుత్వ స్థలాలు ఎక్కడున్నాయో త్వరగా పరిశీలించాలని వీఆర్వో వంశీకి సూచించారు. సమస్యను వెలుగులోకి తీసుకువచ్చి పరిష్కారానికి కృషి చేసిన 'సాక్షి'కి, స్పందించిన తహసీల్దార్ మృత్యుంజయరావుకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ స్త్రీ నిధి



ఆగిరిపల్లి: అర్హులైన ప్రతి ఒక్క సభ్యురాలికి స్త్రీ నిధి మంజూరయ్యేలా చూస్తామని ఏపీఎం బి.రామకృష్ణ అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం వీఓఏలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్త్రీ నిధి రుణాలను ఆన్‌లైన్ ద్వారా చెల్లించడంపై గ్రూప్ సభ్యులకు వీఓ ప్రెసిడెంట్లు అవగాహన కల్పించాలన్నారు. గూగుల్ పే, ఫోన్ పే ద్వారా కూడా సభ్యులు చెల్లింపులు చేసేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. స్త్రీ నిధి రుణాల రికవరీలో నూరుశాతం వసూలు చేసి ఆగిరిపల్లి మండలం జిల్లా ప్రథమస్థానంలో నిలిచిందని ఏపీఎం రామకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో స్త్రీ నిధి మేనేజర్ గోపీనాథ్, ఎంఎస్ అధ్యక్షురాలు శిరీష, సభ్యులు సమ్మక్క, వహీదా, ఖాజాబీ, సీసీలు వెంకటరత్నం, లక్ష్మి పాల్గొన్నారు.

క్లుప్తంగా

పేదల గృహ నిర్మాణాల తనిఖీ

చాట్రాయి: గత ప్రభుత్వంలో పేదలకు కట్టించిన గృహాలను బుధవారం గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. మండలంలోని పర్వతాపురం, బూరుగుగూడెం, నరసింహారావుపాలెం గ్రామాల్లో ప్రభుత్వం మంజూరు చేసి నిర్మించిన ప్రతి ఇంటిని తనిఖీ చేశారు. మంజూరైన గృహాలను నిర్మించారా, లేదా అనే దానిపై తనిఖీలు చేసినట్లు ఆ శాఖ సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ ఈఈ శ్రీనివాసరావు, జంగారెడ్డిగూడెం, టి నర్సాపురం చాట్రాయి వర్క్ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సాహు మహరాజ్‌కు ఘన నివాళి

పెనుగొలను(గంపలగూడెం): సంఘ సంస్కర్త సాహు మహరాజ్ జయంతి కార్యక్రమం పెనుగొలనులో షిర్డీ సాయిబాబా సేవా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సేవా కమిటీ సభ్యులు మాట్లాడుతూ అట్టడుగు వర్గాల కోసం దేశంలో మొదటిసారిగా రిజర్వేషన్ తీసుకొచ్చిన గొప్ప వ్యక్తి సాహు మహరాజ్ అని చెప్పారు. సాహు మహరాజ్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పూటుకూరు ఉదయ్ శ్రీసాయి, దేవర అంజలి, ఇలాసాగరపు పూజిత తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ సభ్యత్వ నమోదు ప్రారంభం



తిరువూరు: ఏపీ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని స్థానిక రాజుపేట ఎంపీయూపీ స్కూల్‌లో బుధవారం ప్రారంభించారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి యూటీఎఫ్ కృషిచేస్తోందని జిల్లా గౌరవాధ్యక్షుడు మచ్చా శ్రీనివాస్ అన్నారు. ఫెడరేషన ఉపాధ్యక్షురాలు అపర్ణ, తిరువూరు మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాయల వినయ్‌కుమార్, నాగేశ్వరరావు, భరత కుమారి, రమేష్, నాగరాజు, బాజీ, రాంప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా కొండపల్లి మున్సిపాల్టీ పరిధిలో పారిశుద్ధ్య పనులను అధికారులు ముమ్మరం చేశారు. మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్ ఆదేశాల మేరకు ఇబ్రహీంపట్నంలోని ప్రధాన మురుగు కాలువల్లో పొక్లెయిన్ ద్వారా పూడిక తీత పనులను సిబ్బంది నిర్వహించారు. వర్షాలకు మురుగునీరు నిలవకుండా జాగ్రత్తలు చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ శంకర్‌నాయక్, మున్సిపల్ ఇంజినీర్ సాయిగణేష్ పర్యవేక్షించారు.

చేతిపంపు ఏర్పాటు



రెడ్డిగూడెం: కుదప గట్టు బజార్‌లో బుధవారం నూతనంగా చేతి పంపును ఏర్పాటు చేశామని సర్పంచ్ బలగాని రాధమ్మ తెలిపారు. గ్రామంలో నీటి సమస్యను పరిష్కరించేందుకు గాను చేతిపంపును ఏర్పాటు చేశామని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పాటిబండ్ల శ్రీనివాసరావు, సెక్రటరీ రవి, రమేష్, మెకానిక్ రాజు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బలగాని తిరుపతిరావు పాల్గొన్నారు.

బ్యూటిఫికేషన్ పనుల పరిశీలన

పటమట (విజయవాడతూర్పు): నిత్యం రద్దీగా ఉండే బెంజిసర్కిల్ వద్ద బ్యూటిఫికేషన్ ఆకర్షణీయంగా ఉండాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. బెంజిసర్కిల్ ఫ్లై ఓవర్ వద్ద నిర్వహిస్తున్న బ్యూటిఫికేషన్‌ను బుధవారం ఆయన పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని ప్రధానమైన జంక్షనైన బెంజిసర్కిల్ వద్ద కాలుష్యాన్ని తగ్గించే దిశగా గ్రీనరీ పెంచాలని ఆదేశించారు. రోడ్లమీదకు వర్షపు నీరు రాకుండా ఎప్పటికప్పుడు సైడ్ డ్రైయిన్లలో పూడిక తొలగించాలని సూచించారు. గ్రీనరీ మెయింటెనెన్స్ కాంట్రాక్టర్ సక్రమంగా పనిచేసేలా అధికారులు నిరంతరం పరిశీలన చేయాలని కోరారు. సిబ్బంది, కార్మికులు పనిలో అప్రమత్తంగా ఉండాలని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్) కె.సత్యవతి, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి.సృజన, జోనల్ కమిషనర్-3 శివరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం మంజూరు


ఆర్థిక సహాయం మంజూరు లేఖ అందిస్తున్న కంపెనీ యాజమాన్యం, మహేష్

ఇబ్రహీంపట్నం: నవయుగ కంపెనీలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ అనుమానాస్పద స్థితిలో ఎన్టీటీపీఎస్ కాలువలో మృతిచెందిన సాకే వీరేంద్ర కుటుంబానికి సంస్థ యాజమాన్యం బుధవారం ఆర్థిక సహాయం అందించింది. గొల్లపూడి వద్ద చిన్నఅవుటపల్లి నుంచి కాజా వరకు నిర్మాణంలో ఉన్న ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణంలో విధులు నిర్వహిస్తున్న కొవ్వూరుకు చెందిన సాకే వీరేంద్ర ఈనెల 24న ఎన్టీటీపీఎస్ కాలువలో శవమై తేలాడు. సీఐటీయూ పట్టణ కార్యదర్శి ఎం.మహేష్ పోరాట పటిమతో వర్క్‌మెన్ కాంపెన్సేషన్ యాక్ట్ రూపంలో రూ.15 లక్షలు, నవయుగ కంపెనీ ద్వారా రూ.7.50 లక్షలు, మట్టి ఖర్చుల నిమిత్తం మరో రూ.50 వేలు మొత్తం రూ.23 లక్షలు బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయంగా అందించారు. సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ


ధర్మవరప్పాడుతండాలో ప్లకార్డులతో విద్యార్థులు


మక్కపేటలో మానవహారం నిర్వహించిన విద్యార్థులు

మక్కపేట(వత్సవాయి) : వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా వ్యాధులు దరిచేరకుండా చూసుకోవచ్చని ఎంఈవో ఎల్.నాగరాజు తెలిపారు. గ్రామంలో డయేరియా కేసులు ఉన్న నేపథ్యంలో గ్రామస్తులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించేందుకు విద్యార్థులతో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు కాచి చల్లార్చిన నీటిని తాగాలని గ్రామస్తులకు సూచించారు. వేడి పదార్థాలను తినడం, చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవడం, బహిరంగ మలవిసర్జన చేయకపోవడం, పరిశుభ్రమైన నీటిని తాగడం ద్వారా వ్యాధులను దూరం చేసుకోవచ్చన్నారు. పరిశుభ్రత పాటిద్దాం డయేరియాను దూరం చేద్దాం అంటూ విద్యార్థులు నినాదాలు చేశారు. ర్యాలీ చేసిన అనంతరం ప్రధాన సెంటర్‌లోమానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచి మల్లెల శివప్రసాద్, హెచ్ఎం చిత్రాల వెంకటేశ్వరరావు, అజ్మీరు శ్రీనివాసరావు, పీడీవీ ప్రసాదరావు పాల్గొన్నారు.

చిల్లకల్లులో..

జగ్గయ్యపేట: డయేరియా నివారణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు చిల్లకల్లు, ధర్మవరప్పాడుతండ గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో బుధవారం ర్యాలీ చేశారు. అందరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలంటూ విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శించారు. ఆయా గ్రామాల కార్యదర్శులు నరసింహారావు, శ్రీనివాసరాజు, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

డీ అడిక్షన్ సెంటర్లను వినియోగించుకోవాలి

ఓడీఐసీ కో-ఆర్డినేటర్ అనిల్ కుమార్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మాదక ద్రవ్యాలు వినియోగించే వారు డీ అడిక్షన్ సెంటర్లను వినియోగించుకోవాలని ఓడీఐసీ కో-ఆర్డినేటర్ అనిల్ కుమార్ అన్నారు. హనుమాన్‌పేటలోని ఏపీ డ్రగ్ యూజర్స్ ఫోరం ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫోరం ఆధ్వర్యంలో సపోర్ట్ డోంట్ పనిష్ అనే కమ్యూనిటీ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తుకు బానిసలైన వారు డీ అడిక్షన్ సెంటర్లను వినియోగించుకోవడం ద్వారా మత్తు నుంచి విముక్తి పొందవచ్చన్నారు. మత్తు నుంచి బటయ పడాలనే దృఢ సంకల్పం ఉన్న వారు ట్రీట్‌మెంట్ తీసుకోవాలన్నారు. ఆంధ్రప్రదేశ్ డ్రగ్ యూజర్స్ ఫోరం ప్రెసిడెంట్ వి. నాగరాజు మాట్లాడుతూ మత్తు పదార్థాలకు బానిసలైన వారిని శిక్షించే విధంగా కాకుండా వారికి సరైన ట్రీట్‌మెంట్ అందజేయడం వల్ల వారిని ఈ మాదక ద్రవ్యాల నుంచి బయటపడేయవచ్చన్నా రు. అలా కాకుండా వారిని శిక్షిస్తే కుటుంబ సభ్యు లు, సమాజంలో వివక్షకు గురవుతారన్నారు. ప్రతి ఒక్కరూ ఈ మహమ్మారి నుంచి బయటకు రావాలన్నారు. జిల్లా డ్రగ్ యూజర్స్ ఫోరం ప్రెసిడెంట్ ఎస్‌కే బాషా, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

రేపు మెగా వైద్య శిబిరం

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాజీవ్‌నగర్ కండ్రిక రోడ్డులోని మాస్టర్‌మైండ్స్ స్కూల్లో ఈ నెల 28న మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వావిలాల రజనీకాంత్‌శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో వన్‌టౌన్‌లోని అయాన్ ఐ ఆస్పత్రికి చెందిన డాక్టర్ బషీర్ అహ్మద్ బృందం కంటి సమస్యలైన శుక్లాలు, నీటి కాసులు, నల్లగుడ్డు, మైగ్రేన్, రెటీనా లోపాలకు ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తారన్నారు. సింగ్‌నగర్‌లోని ఫ్యామిలీ ఆస్పత్రికి చెందిన డాక్టర్ సైరాభాను పాల్గొని బీపీ, షుగర్, థైరాయిడ్, కిడ్నీలో రాళ్లు, అతిమూత్రం, రక్తహీనత, నిద్రలేమి వంటి సమస్యలకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు ఇస్తారని చెప్పారు. చిన్నపిల్లలు, మహిళల ఆరోగ్య సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారని, 26 రకాల రక్తపరీక్షలు ఉచితంగా చేస్తారన్నారు.

డయేరియా నియంత్రణకు ముందస్తు చర్యలు

ఎంపీడీఓ శామ్యూల్

ఆగిరిపల్లి: డయారియా రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ శామ్యూల్ అన్నారు బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వైద్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ప్రజలు ఇంటి పరిసర ప్రాంతాల్లో దోమలు, ఈగలు చేరకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. వైద్య అధికారులు జ్యోష్ణ, మంజుల మాట్లాడుతూ కాచి చల్లార్చిన నీరు, క్లోరినేషన్ చేసిన నీటిని తాగాలన్నారు. బయటి ఆహార పదార్థాలు తినకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ఆరోగ్య సిబ్బంది సీజనల్ వ్యాధులపై గ్రామాల్లో అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ శేఖర్, ఏఓ అబ్దుల్ సలాం, పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

వైభవంగా బొడ్రాయి వార్షికోత్సవం



మక్కపేట(వత్సవాయి) : మండలంలోని మక్కపేట బొడ్రాయి ప్రతిష్ఠా మొదటి వార్షికోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. మల్లెల గాంధీ ఆధ్వర్యంలో మహిళలు జలబిందెలతో పసుపునీళ్లు తీసుకువచ్చి బొడ్రాయి, మహాలక్ష్మమ్మ చెట్టుకు నీళ్లుపోసి పూజలు చేశారు. అనంతరం డప్పు వాయిద్యాల నడుమ మహిళలను జలబిందెలను తలపై పెట్టుకుని ఊరేగింపుగా గ్రామశివార్లలో ఉన్న ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం వద్దకు చేరుకుని మొక్కులు తీర్చుకుని జలాభిషేకాలు చేశారు. కార్యక్రమంలో సర్పంచి మల్లెల శివప్రసాద్, పెద్దగొల్ల బాదినేని రామారావు, గ్రామ పురోహితులు రాఘవశర్మ తదితరులు పాల్గొన్నారు.

రక్షిత మంచినీటి పథకాల పరిశీలన

తిరువూరు: పట్టణంలోని రక్షిత మంచినీటి పథకాలను మున్సిపల్ పబ్లిక్ హెల్త్ క్వాలిటీ కంట్రోల్ సూపరింటెండింగ్ ఇంజినీర్ శ్రీనివాస్ బుధవారం తనిఖీ చేశారు. ఇటీవల ఓవర్ హెడ్ ట్యాంకులకు నిర్వహించిన మరమ్మతు పనులు, పైపులైన్ల నిర్మాణ పనులను పరిశీలించారు. రానున్న వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున మంచినీరు కలుషితం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని నగర పంచాయతీ కమిషనర్ లోవరాజును ఆదేశించారు. గతంలో చేపట్టిన కృష్ణా నదీ జలాల సరఫరా పైలెట్ ప్రాజెక్టు పునఃప్రారంభించే అంశాన్ని కూడా పరిశీలించారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ భూషణం, డీఈఈ కృష్ణబాబు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

పీహెచ్‌సీ వైద్యాధికారి జ్యోతి


చిత్తపూరు ర్యాలీలో పాల్గొన్న వైద్యాధికారి జ్యోతి

చాట్రాయి: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చాట్రాయి పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.జ్యోతి అన్నారు. బుధవారం మండలంలోని చిత్తపూరు గ్రామంలో మలేరియా వ్యతిరేక మహోత్సవ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు బారిన పడకుండా తగిన జాగ్రతలు తీసుకోవాలన్నారు. తీవ్ర జ్వరం, చలి, వణుకు, చెమటలు పట్టడం వంటి లక్షణాలు కనిపిస్తే మలేరియా జ్వరంగా భావించి వెంటనే వైద్యం పొందాలని సూచించారు. వాడిన కొబ్బరి బొండాలు, బాటిళ్లు, టైర్లు వంటి పరికరాల్లో నీరు నిల్వ ఉండి దోమలు వ్యాప్తి చెందుతాయని, అలాంటివి పరిసర ప్రాంతాల్లో లేకుండా చూసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో సీహెచ్ఓ ఫణికుమార్, హెల్త్ అసిస్టెంట్లు, ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు


గ్రాడ్యుయేషన్ పట్టాలు అందుకున్న చిన్నారులతో ఎంపీపీ గాంధీ, ఉషారాణి

పెనుగంచిప్రోలు: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో కూడిన విద్యను అందిస్తున్నందున, మూడేళ్లు నిండిన చిన్నారులందరినీ తల్లిదండ్రులు అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని ఎంపీపీ మార్కపూడి గాంధీ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుతున్న ఐదేళ్లు నిండిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చేందుకు ఈ గ్రాడ్యుయేషన్ డే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.ఉషారాణి అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారాన్ని అందిస్తునట్లు వివరించారు. అనంతరం పాఠశాలలకు వెళ్లే పిల్లలకు గ్రాడ్యుయేషన్ పట్టాలు అందజేశారు. ఈకార్యక్రమంలో ఏఓ సిద్దారెడ్డి, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

అరుదైన అపెండిక్స్ క్యాన్సర్‌కు చికిత్స

లబ్బీపేట(విజయవాడతూర్పు): అపెండిక్స్ క్యాన్సర్‌కు వినూత్నమైన హిపెక్ (హెచ్ఐపీఈసీ) విధానాన్ని ఉపయోగించి విజయవంతంగా చికిత్స చేశామని కానూరులోని అమెరికన్ అంకాలజీ ఇనిస్టిట్యూట్ సర్జికల్ అంకాలజిస్ట్ డాక్టర్ శ్రీకాంత్ కోటగిరి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం మీడియాతో మాట్లాడుతూ నగరానికి చెందిన 54 ఏళ్ల రోగి అపెండిక్స్‌కు వేరే ఆస్పత్రిలో చికిత్స పొందిన తర్వాత తీవ్రమైన కడుపునొప్పి, బొడ్డు హెర్నియాతో తమ ఆస్పత్రికి వచ్చినట్లు తెలిపారు. రోగి గ్రేడ్ మ్యూకినస్ అపెండిషియల్ నియోప్లాజముతో బాధపడుతున్నట్లు తెలిపారు. అది అపెండిక్స్‌లో ఉద్భవించే అరుదైన క్యాన్సర్‌గా తెలిపారు. అది శ్లేష్మం ఉత్పత్తి చేసే కణితి కణాల పెరుగుదలను ఉలిగి ఉంటుందన్నారు. తొలుత రోగి పొత్తి కడుపు నుంచి క్యాన్సర్ కణజాలాన్ని తొలగించినట్లు తెలిపారు. అనంతరం హైపర్‌థెర్మిక్ ఇంట్రాపెరిటోనియల్ కీమోథెరపీ (హిపెక్) చేసి మిగిలిన క్యాన్సర్ కణాలను తొలగించామని వివరించారు. ఈ సంక్లిష్ట ప్రక్రియలో తనతో పాటు డాక్టర్ విజయ్ కోడూరు, డాక్టర్ టి.మృదుల, డాక్టర్ ఉమా బృందం పాల్గొన్నారని చెప్పారు. అరుదైన క్యాన్సర్‌కు వినూత్నమైన చికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు.